క్లుప్తంగా

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



నీలం పూర్ణశ్రీ సత్యవెంకటచందు, పాకిరం జనార్దన్

నల్లజర్ల: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో మండలంలో ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించారు. సింగరాజుపాలెం ప్రాథమిక పాఠశాలకు చెందిన నీలం పూర్ణశ్రీ సత్యవెంకట చందు, దూబచర్ల సంఘమిత్ర స్కూలుకు చెందిన పాకిరం జనార్దన్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సేంద్రియ ఆకుకూరల పంపిణీ



పెద్దేవంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: పెద్దేవంలోని ఎస్సీ ఏరియాను కోడ్ నంబర్ 106, 107, 108 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన ఆకుకూరలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ భాస్కరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, సొంత భవనం ఉండి, ఖాళీ ప్రదేశం కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సొంతంగా పండించిన ఆకుకూరలతో అంగన్‌వాడీ పిల్లలకు భోజనం పెట్టాలన్న నిబంధన అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వేద కుమారి, కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిగిరిపల్లి గోపి, నాయకులు హనుమంతు, రాజేష్, అంగన్‌వాడీ వర్కర్లు ఎం.కుమారి, డి.దయామణి పాల్గొన్నారు.

వల్లభస్వామికి వెండి వస్తువుల సమర్పణ

పెరవలి: కానూరు గ్రామంలో వేంచేసియున్న వల్లభస్వామి ఆలయానికి తణుకు పట్టణవాసి వాడపల్లి గంగాధర శాస్త్రి రూ.50 వేలు విలువ కలిగిన వెండి వస్తువులను బుధవారం సమర్పించారు. స్వామి వారికి వెండి పళ్లెం, శఠగోపాన్ని ఆలయ ధర్మకర్త మండలి సమక్షంలో అర్చకులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా నూతన వెండి వస్తువులకు పూజలు నిర్వహించారు.

హృదయాలయంలో రెవెన్యూ అధికారుల తనిఖీ



హృదయాలయంలో భోజనశాలను పరిశీలిస్తున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

నిడదవోలు : శంకరాపురంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాల, పునరావాస కేంద్రం (హృదయాలయం)లో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హృదయాలయంలో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగులకు అందిస్తున్న సదుపాయాలను ఆమె పరిశీలించారు. వసతి గదులు, భోజనశాలలో ఆహార పదార్థాలను పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దివ్యాంగులకు అందిస్తున్న సేవలపై నిర్వాహకులు దండే గణేష్‌బాబు, బలగం విశాలాక్షిని ఆమె అభినందించారు. హృదయాలయానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.

నేడు అన్నాభిషేకం

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నంలో గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామికి గురువారం అన్నాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. మహాలింగేశ్వరస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగి మండల కాలం పూర్తయిన సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మొబైల్స్ చోరీ.... ఆపై ఆత్మహత్యాయత్నం

కొవ్వూరు: గోష్పాదక్షేత్రంలో గోదావరి నదిలో ప్రధాన స్నానఘట్టంలో మొబైల్స్ చోరీకి పాల్పడి దొరికిపోయిన పల్లా పోలయ్య అనే నిందితుడు తన వద్ద ఉన్న చిన్న కత్తెరతో పొట్టలో పొడుచుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములు స్నానాలు ఆచరించేందుకు నదిలోకి వెళుతూ తమ ఖరీదైన సెల్‌ఫోన్లను చొక్కా జేబులో పెట్టుకున్నారు. అది గుర్తించిన పోలయ్య చోరీకి పాల్పడ్డాడు. చోరీని అక్కడి స్థానికులు గుర్తించి పోలయ్యను పట్టుకున్నారు.దీంతో జనం కొడతారని భయపడిన పోలయ్య తన వద్ద ఉన్న చిన్న కత్తెరలో పొట్టలో పొడుచుకున్నాడు.దీంతో అతనికి రక్తపు గాయమైంది. అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. నిందితుడు బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందినవాడని ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.నల్లా ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అన్నదాతకు సాగునీటి కష్టాలు

- దాళ్వా ఆరంభం నుంచి అవస్థలు
- ప్రధాన కాలువ ద్వారా నీరు అందక ఇబ్బందులు
- బోర్లు, మోటార్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు
- భారీగా పెరిగిపోతున్న పెట్టుబడి



పెరవలి వద్ద పాలు పోసుకునే దశలో వరి చేలు



అజ్జరం వద్ద నరసాపురం కాలువ నీటిని తోడుతున్న దృశ్యం



కాకరపర్రు వద్ద కాలువలో అంతంత మాత్రంగా ప్రవహిస్తున్న సాగునీరు

పెరవలి: ఈ ఏడాది దాళ్వా సాగుకు నాట్ల నుంచి ప్రారంభమైన సాగు నీటి కష్టాలు- పంట కోత దశకు చేరుతున్నా తీరేలా కనిపించటం లేదు. అధికారులు ప్రజాప్రజానిధులు తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరించడంతో పెరవలి మండలంలోని రైతులు పడే పాట్లు వర్ణనాతీతం. చుట్టూ కాలువలున్నా చుక్కనీరు చేలకు రాకపోవటంతో ప్రధాన కాలువలోనే మోటార్లు ఏర్పాటు చేసి రైతులు వ్యయప్రయాసలు ఎదుర్కొని పంటలకు నీరు తోడుకునే దుస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల రైతులు మురుగు కాలువలోని నీటిని తోడుకుని పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

వంతుల వారీగా నీటి సరఫరాతో ఇక్కట్లు

ప్రధాన కాలువల్లోకి సాగు నీరు కేవలం 1,300 క్యూసెక్కులు మాత్రమే విడుదల కావడంతో నీరు ఆయకట్టు పరిధిలోని పొలాలకు చేరకపోవడంతో రైతులు మోటార్లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. పెరవలి లాకుల పరిధిలోని 36,500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా నీటి ప్రవాహం అంతంత మాత్రంగా రావటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నిడదవోలు-నరసాపురం కాలువలోకి సాగు నీరు 1,600 క్యూసెక్కులు రావలసి ఉండగా నేడు 1,300 మాత్రమే వస్తోంది. చేలకు నీరు అందటం లేదని రైతులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. అందుబాటులో ఉన్న నీటిని వంతుల వారీగా పంపిణీ చేస్తున్నామని అధికారులు అంటున్నారు.

శివారు ప్రాంత రైతుల కష్టాలు వర్ణనాతీతం

డెల్టా ముఖ ద్వారంలోనే సాగు నీటి కష్టాలు ఉంటే దిగువ ప్రాంత రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. లాకుల పక్క చేలకు సాగునీరు అందడంలేదని అధికారులకు చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా సాగుకు సరిపడా నీరు ఇవ్వాలని కోరుతున్నా సమాధానం చెప్పేవారు కరువయ్యారని రైతులు ధ్వజమెత్తుతున్నారు.

పంట దిగుబడిపై ప్రభావం

ప్రస్తుతం చేలు ఈనిక దశ, గింజ పాలుపోసుకుని గట్టిపడే దశలో ఉన్నాయని ఈ సమయంలో నీరు పుష్కలంగా అందకపోతే తాలు గింజలు ఏర్పడి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకోవటానికి ఖర్చు పెరిగినా మోటార్లతో నీటిని తోడుకోవాల్సి వస్తోందని సాగుదారులు అంటున్నారు. మండలంలో పెరవలి, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, అన్నవరప్పాడు, కాపవరం, అజ్జరంలో కాలువల కంటే బోర్లపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు.చిన్న, పిల్ల కాలువల్లోకి నీరు రాకపోవటంతో ప్రధాన కాలువల పక్కన ఉన్న గ్రామాల రైతులు కాలువల్లోకి ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుకుని చేలకు తరలిస్తున్నారు. అజ్జరం, పెరవలి, ఖండవల్లి, కాకరపర్రులో ఈ పరిస్థితి నెలకొంది.

కష్టాలు ఇప్పటికీ తీరలేదు



దాళ్వా సాగు చేపట్టిన నాటి నుంచి నెలకొన్న కష్టాలు ఇప్పటికీ తీరలేదు. నిత్యం ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవటం లేదు. సాగు నీరు అందక మోటార్లతో నీటిని తోడుకుంటున్నాం. మా కష్టాలను పట్టించుకున్న నాథుడు లేడు.

– జిడ్డు ఏడుకొండలు, రైతు, కాకరపర్రు

మోటార్లతో నీటిని తోడుకుంటున్నాం



దాళ్వా సాగు చివరి దశకు వచ్చినా ఇప్పటికీ సక్రమంగా నీరు అందటం లేదు. చేలు బీటలు వారుతున్నాయి. చేలు గింజ పాలు పోసుకునే దశ, గట్టిపడే దశలో ఉన్నాయి. ఇప్పుడు నీరు అందకపోతే చేలు ఎండిపోయి తాలు గింజలు వస్తాయి. పెట్టుబడి ఎక్కువ అయినా మోటార్లతో నీటిని తోడుకుంటున్నాం.

– అల్లం సత్యనారాయణ, కౌలు రైతు, పెరవలి

బాధిత కుటుంబానికి వనిత పరామర్శ



నాగిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో ఇటీవల కొవ్వూరు నాగిరెడ్డి మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను బుధవారం మాజీ హోం మంత్రి తానేటి వనిత, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. యువ నాయకుడు కొవ్వూరి జయంత్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి మృతి ఆయన కుటుంబానికి తీరనిలోటని అన్నారు. వీరివెంట ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వింత ప్రసాద్‌రెడ్డి, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, చాపల రమేష్‌బాబు, ముద్దన మురళీ ఉన్నారు.

వనిత పరామర్శ

నల్లజర్ల: గంటావారిగూడెం ఎంపీటీసీ యలమర్తి సూర్యకుమారి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసు తండ్రి రామారావు మంగళవారం రాత్రి మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మాజీ హోంమంత్రి తానేటి వనిత బుధవారం పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, తొమ్మండ్రు రమేష్ తదితరులున్నారు.

ముగిసిన మేరీమాత ఉత్సవాలు



గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం

దేవరపల్లి: గౌరీపట్నం నిర్మలగిరి మేరీమత పుణ్యక్షేత్రం మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 22న ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం రాత్రి అగ్రపీఠాధిపతుల సమష్టి దివ్యబలిపూజ సమర్పణతో ముగిశాయి. పుణ్యక్షేత్రం మహోత్సవాలతో పాటు అఖండ దేవాలయం జూబ్లీ ఉత్సవాలను పీఠాధిపతులు వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజూ దివ్యబలిపూజా కార్యక్రమాలు, జపమాల ధ్యానం, పరిశుద్ధ జపమాల, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మరియ తల్లి పండగ నాలుగు రోజులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు, ఫాదర్లు తరలి వచ్చి ప్రార్థనలు చేశారు. లక్షలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుమారు 200 మంది పోలీస్ సిబ్బందితో క్షేత్రంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 250 మంది వలంటీర్లను నియమించారు. సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన పుణ్యక్షేత్రంలో అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. ప్రతిరోజూ రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ ఏర్పడింది. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

పదో తరగతి పరీక్షకు 1010 మంది హాజరు



దేవరపల్లి జెడ్పీ హైస్కూలు కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

దేవరపల్లి: పదో తరగతి పరీక్షలు దేవరపల్లి మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు 1010 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవోలు ఎం.తిరుమల దాస్, కెఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని తిరుమల దాస్ తెలిపారు. యర్నగూడెం కేంద్రంలో ముగ్గురు, దేవరపల్లి శ్రీచైతన్య కేంద్రంలో 8 మంది, జెడ్పీ హైస్కూలు కేంద్రంలో 5, భాష్యం స్కూలు కేంద్రంలో 12 మంది, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ఆయన వివరించారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో మొత్తం విద్యార్థుల సంఖ్య 1040 మంది కాగా 1010 మంది పరీక్షకు హాజరైనట్టు ఆయన తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 97.27 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు 85.71 శాతం పరీక్ష రాసినట్టు ఆయన తెలిపారు.

నిర్మలగిరి ఉత్సవాల్లో జగన్ చిత్రపటాల విక్రయం

300 చిత్రపటాల అమ్మకం



నిర్మలగిరి పున్యక్షేత్రంలో అమ్మకానికి ఉంచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలు

దేవరపల్లి: తీర్థయాత్రల్లో పుణ్యక్షేత్రాలను సందర్శించినప్పుడు భక్తులు దేవుడి చిత్రపటాలను కొనుగోలు చేసి ఇళ్లకు తెచ్చుకుంటారు. అయితే దేవరపల్లి మండలం గౌరీపట్నంలో గత నాలుగు రోజులు నిర్వహించిన నిర్మలగిరి మేరీమాత ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాల విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల్లో సుమారు 300 చిత్రపటాలను విక్రయించినట్టు దుకాణదారుడు ఖాన్ తెలిపారు. ప్రజల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై అభిమానం పోలేదని, దేవుడు ఫొటోల కంటే జగనన్న చిత్రపటాలను ఎక్కువగా అమ్మకాలు జరిగినట్టు ఆయన తెలిపారు. సాధారణ రోజుల్లో కూడా జగన్ చిత్రపటాలను ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

దుర్గారావు మృతదేహం లభ్యం



మృతుడు చల్లా దుర్గారావు (ఫైల్)

పెరవలి: జీవితంపై విరక్తి చెంది కాలువలో దూకిన చల్లా దుర్గారావు మృతదేహం బుధవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు (29) మంగళవారం మధ్యాహ్నం పెరవలి లాకుల వద్ద నిడదవోలు –నరసాపురం కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వలలు వేసి, గజ ఈతగాళ్లతో గాలించినా ఫలితం లేకపోయింది. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇరగవరం మండలం తూర్పు విప్పర్రు సమీపంలో మృతదేహం లభ్యమయ్యింది. పెరవలి ఎస్సై యం వెంకటేశ్వరరావు, మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మృతదేహాన్ని చూసి తండ్రి సుబ్బారావు, తల్లి లక్ష్మి, అన్న రాంబాబు కన్నీరు మున్నీరుగా విలపించారు. వృద్ధాప్యంలో అండగా ఉంటాడనుకున్న కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ తల్లిదండ్రులు విలపించిన తీరును చూసి చూపరులు కన్నీటి పర్యంతమయ్యారు.

రైతులంతా రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలి



కొవ్వూరులో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏవో

నిడదవోలు రూరల్: సొంత పొలం కలిగిన రైతులంతా రైతు రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం సచివాలయంలో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు, సేవలు అందించేందుకు అగ్రి స్టాక్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మండలంలో 10,465 మంది రైతులుండగా ఇప్పటి వరకు 8,100 మంది రైతులకు ఐడీ నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, ఏవో జి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు కె.శివనాగు, మాధవన్, రైతులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కొవ్వూరు: సొంత భూమి కలిగిన రైతులంతా కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధరరావు సూచించారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి అందే పథకాలన్నీ రైతులకు అందుతాయన్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుకి ఒక యూనిక్ ఐడీ నంబర్ ఇస్తారన్నారు. మార్చి 31వ తేదీలోపు ప్రతి రైతు కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు. వేములూరు, కొవ్వూరు, వాడపల్లిలో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసినట్లు ఆయన తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు ప్రత్యేక శిబిరాలు

నల్లజర్ల: రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు సక్రమంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ ఆన్‌లైన్ అడ్డంకులు తొలగిపోయి వేగవంతమైనట్టు వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రత్యేక శిబిరాలకు వెళ్లి రైతులు తమ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

2.61 లక్షల కిలోల పొగాకు కొనుగోలు

దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో బుధవారం నాటికి 2.61 లక్షల కిలోల పొగాకు కొనుగోలు చేసినట్టు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ నెల 24 నుంచి వర్జీనియా పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. బుధవారం వేలం కేంద్రాలకు 1619 బేళ్లు అమ్మకానికి రాగా, 758 బేళ్లు కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకు 2018 బేళ్లు విక్రయాలు జరిగినట్టు ఆయన తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 20183 కిలోలు, జంగారెడ్డిగూడెం -1 వేలం కేంద్రంలో 71005 కిలోలు, జంగారెడ్డిగూడెం-2 వేలం కేంద్రంలో 81,703 కిలోలు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 61,364 కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 26,826 కిలోల పొగాకు అమ్మకాలు జరిగినట్టు వివరించారు. కిలో గరిష్ఠ ధర రూ.290, కనిష్ఠ ధర రూ.270, సగటు ధర రూ.284.72 లభించినట్టు ఆయన తెలిపారు.

కూలీలకు కనీస వేతనాలందేలా పని కల్పించాలి



తాళ్లపూడిలో ఉపాధి హామీ పథకంపై చర్చిస్తున్న అధికారులు

తాళ్లపూడి: వేసవిలో ఉపాధి హామీ పనుల్లో కూలీలకు కనీస వేతనాలు వచ్చే విధంగా అధికారులు పని కల్పించాలని ఎంపీడీవో టీబీ వెంకటరమణ తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంచ ప్రాధాన్యాల పేరుతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో చేపట్టే వేసవి పనులకు ఉపాధి కల్పనా ప్రణాళికలు తయారీ కోసం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి కూలీకి రోజుకు సగటు వేతనం కనీసం రూ. 290 తగ్గకుండా వేతనం వచ్చే విధంగా పనులు గుర్తించాలన్నారు. గ్రామాల్లో పశువులు నీటి తొట్టిల నిర్మాణం, ఫాం పాండ్స్ నిర్మాణం, పంట కాలువల పూడిక తీత, సాగు నీటి చెరువుల పూడిక పనులకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమాదేవి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు



మునస వీరబాబు (ఫైల్)

రాజానగరం/కొవ్వూరు: కుటుంబ పోషణలో తండ్రికి తోడుగా ఉంటున్నారనుకుంటున్న ఇద్దరు కొడుకులలో ఒకడు రాజమహేంద్రవరం, గోదావరిలోకి దూకేశాడని తెలిసిన ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోజులాగే బుధవారం ఇంటి నుంచి వెళ్లిన చిన్నకొడుకు ఆచూకీ తెలియక వారు తల్లడిల్లిపోతున్నారు. రాజానగరం కొత్తకాలనీలో నివాసం ఉంటున్న మునసా వీరబాబు (19) హఠాత్తుగా బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం రోడ్డుకం రైల్ బ్రిడ్జి నుంచి గోదావరిలో దూకేశాడు. పోలీసుల ద్వారా ఈ విషయం తెలుసుకుని, అతని కుటుంబ సభ్యులు హుటాహుటిన బ్రిడ్జి వద్దకు పరుగు తీశారు. వివరాల్లోకి వెళితే వీరబాబు లాలా చెరువులో ఆటో మొబైల్ షాపులో పని చేస్తున్నాడు.స్నేహితులతో కలసి బుధవారం ఉదయం రంపచోడవరం వెళ్లాడు. స్నేహితుడు వెంకీతో కలసి వీరబాబు రాత్రి రోడ్డు కం రైలు వంతెన పైకి వచ్చిన వెంటనే మోటారు సైకిల్ ఆపి తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ స్నేహితుడికి ఇచ్చి అతడు వారించినా ఆగకుండా ఒక్కసారిగా గోదావరి నదిలోకి దూకేశాడు. దీంతో స్నేహితుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈ ఘటనతో రోడ్డు కం రైలు వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి పొద్దుపోవడంతో యువకుడి కోసం నదిలో గాలించడానికి వీలుకాలేదు. వీరబాబు తండ్రి మునసా సత్యనారాయణ లారీ డ్రైవర్, తల్లి గృహిణి. వీరికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడు రాజమహేంద్రవరంలో ఒక అధికారికి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండోవాడైన వీరబాబు ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు.

సంక్షిప్తంగా..

ఉపాధి హామీ పనులపై సమీక్ష

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా రాబోవు మూడు నెలల పాటు పంచ ప్రాధాన్య కార్యక్రమాలు అమలు చేయాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ ఆదేశించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులపై బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల తొట్టి నిర్మాణాలతో పాటు 540 పంట కాలువల్లో పూడిక తీయాలని సూచించారు. సింగవరం, కంసాలిపాలెం, గోపవరం, కలవచర్లలో సాగునీటి చెరువులు పూడికతీయడంతో పాటు కూలీలకు రూ.290 వేతనం వచ్చేలా పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఏవీవీ సత్యనారాయణ, టీఏలు పి.భాస్కర్ పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

నల్లజర్ల: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి అనుమానాస్పదంగా ఉందని ఆయన మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని గోపాలపురం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పిట్టా జాన్‌సుకుమార్ డిమాండ్ చేశారు. నల్లజర్లలో ఆయన బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ ఆయన మృతికి కారకులైన వారిని గుర్తించి చట్టప్రకారం శిక్షించాలని క్రిస్టియన్ సంఘాల తరఫున ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాస్టర్లపై దాడులు అధికమయ్యాయన్నారు. దాడులు ఇదే విధంగా కొనసాగితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ విషయంలో హోంమంత్రి అనిత నిష్పక్షపాతంగా దర్యాప్తునకు ఆదేశించాలన్నారు.

బాలిక అదృశ్యం

గోపాలపురం: ఇంటి నుంచి వెళ్లిన బాలిక అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని ఎస్సై కర్రి సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు, గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన కొండుబోయిన మమత(16) బుధవారం ఉదయం 5 గంటలకు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమె తిరిగిరాకపోవడంతో తండ్రి గంగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96665 నంబరును సంప్రదించాలని ఎస్సై కోరారు.

నవ ధాన్యాలను సాగు చేయాలి

చాగల్లు: భూసారం పెంచుకోవడానికి రైతులు పచ్చి రొట్ట ఎరువుగా నవధాన్యాలు పండించాలని ప్రకృతి వ్యవసాయం అధనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహబూబా వలీ అన్నారు. బుధవారం స్థానిక రైతు సేవాసేంద్రంను సందర్శించిన ఆయన సిబ్బందితో కలసి నవధాన్యాలు కిట్‌ను తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. 13 కేజీల విత్తనాల కిట్‌ను రూ.100 అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వరి కోతలు త్వరలో ప్రారంభం కానున్నాయని, కోత పూర్తయిన వెంటనే పచ్చిరొట్ట ఎరువుగా నవధాన్యాలను పెంచాలని చెప్పారు. జూనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ గతంతో పోలిస్తే రైతులు నవధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: పట్టణంలో మెరకవీధి వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద బుధవారం సైకిల్‌పై వెళుతున్న మాసా మాణిక్యం అనే వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యం కాలికి బలమైన రక్తపు గాయమైంది.108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు.అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గాయపడిన బాధితుడు కొవ్వూరు ఒకటో వార్డులోని శ్రీరామకాలనీకి చెందిన వ్యక్తి అని తెలిపారు.